నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 7 నవంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

ప్రశ్నార్థకంగా తండాల పరిస్థితి..

సుదీర్ఘకాలంగా గిరిజనులు డిమాండ్ చేస్తున్న 'మా తండాలో మా రాజ్యం' డిమాండ్ తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ నెర వేర్చారు. వేలాది తండాలన్నీ గ్రామ పంచాయతీలుగా మార్చారు. ఇతరుల దయా దాక్షిణ్యాలతో ప్రమేయం లేకుండా గిరిజనులే పాలకుల య్యారు. తమ పంచాయతీలను తామే తీర్చిదిద్దుకున్నారు. పంచాయతీలుగా మారిన ఈ తండాలన్నింటికీ కేంద్ర రాష్ట్రాలు జనాభా ఆధారంగా నేరుగా నిధులొచ్చాయి. రాజకీయంగా అనేక మంది గిరిజనులు నాయకులుగా ఎదిగే అవకాశం లభించింది. పంచాయతీలుగా మారి ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న తండాలన్నీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో విలీనమైతే గిరిజనుల అస్తిత్వంపై దెబ్బకొట్టినట్లేనని గిరిజన నేతలు అభిప్రాయపడుతున్నారు. నిధుల కోసం అభివృద్ధి కోసం మున్సిపాలిటీ చైర్మన్లపై ఆధారపడాల్సి వస్తుందని.. తమ చేతుల్లో ఉన్న రాజ్యాధికారం మళ్లీ లాక్కున్నట్లే అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముడా పరిధిలోకి రానున్న హన్వాడ

అర్బన్ పంచాయితీ!

ప్రశ్నార్థకంగా తండాల భవిష్యత్?

- ఉమ్మడి జిల్లాలో మరో నాలుగు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు
- ముడా పరిధి పెంచేందుకు కసరత్తు
- జిల్లా కేంద్రాల సమీప పంచాయతీలు, తండాలపై ఎఫెక్ట్
- భారీగా పెరగనున్న ఆస్తి పన్ను, ఇతర ట్యాక్సులు
- లబోదిబోమంటున్న శివారు గ్రామ పంచాయతీల వాసులు

మహబూబ్‌నగర్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వం పట్టణాలు పంచాయతీల మధ్య చిచ్చు పెడుతున్నది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కొత్తగా నాలుగు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేసేం దుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతమున్న మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని (ముడా)కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. తాజాగా ముడా పరిధిని పెంచుతూ కొత్తగా మరో నాలుగు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు చేసేం దుకు ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఇంతవరకు బాగానే ఉంది కానీ, జిల్లా కేంద్రాలకు సమీపంలో ఉన్న తండాలు పంచాయతీలపై దీని ఎఫెక్ట్ పడుతుండడంతో జనం గగ్గోలు పెడుతున్నారు. పేరుకే శివారు గ్రామాలు అయినప్పటికీ రియల్ ఎస్టేట్ రంగం పెద్దగా అభివృద్ధి చెందలేదు. పైగా ఈ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో కలిపితే ఆస్తి పన్ను ఇతర ట్యాక్సులు భారీగా కట్టాల్సి వస్తుందని జనం జంకుతున్నారు. అంతేకాకుండా కొత్తగా ఏర్పాటైన అనేక తండాలు కూడా ఈ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో విలీనమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. గ్రామాల్లో అంతంత మాత్రమే ఉన్న ప్రజల జీవన ప్రమాణాలపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనున్నది. ఇంటి నిర్మాణానికి పర్మిషన్ తీసుకోవాలన్నా భారీగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఆస్తి పన్ను కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. పంచాయతీల్లో సంపాదించింది అంతా తిండికే సరిపోతున్న తరుణంలో కొత్తగా పన్నులు ఎక్కడి నుంచి కడతాయని జనం ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మున్సిపాలిటీల వరకే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తే బాగుం టుందని అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. సమీప గ్రామాలను వీటిలో చేర్చడం వల్ల అన్ని రకాలుగా నష్టపోవాల్సి ఉంటుందని గ్రామీణులు వాపోతున్నారు. అంతేకాకుండా కొత్తగా ఏర్పాటైన తండాలు పంచాయతీలుగా మారిన ఐదేండ్లకే వార్డులకు పరి మితమయ్యే పరిస్థితి దాపురించిందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

కొత్తగా నాలుగు ఏర్పాటు

రాష్ట్రంలో అనేక మున్సిపాలిటీలకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేస్తున్నది. ఈ క్రమంలో మున్సిపాలిటీల పరిధులను భారీగా పెంచుతున్నది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నారాయణపేట, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలుగా ఏర్పాటు చేస్తోంది. ఫలితంగా ఇప్పటికే ఆయా మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలను కాదని సమీప గ్రామాలు, తండాలను కూడా ఈ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లో కలిపేందుకు అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో తండాలు గ్రామాలను ఒక్క కలం పోటుతో మున్సిపాలిటీల్లో విలీనం చేసే అవకాశాలు లేకపోలేదు. ఇదే గనుక జరిగితే తండాలు పంచాయతీలు వార్డులుగా మారి పోతాయి. స్వయం ప్రతిపత్తిని సైతం కోల్పోతారు. దీని వల్ల ఏటా కేంద్రం రాష్ట్రం కేటాయించే నిధులు నిలిచిపోవడమే కాకుండా ఈ పంచాయతీలు అభివృద్ధి కావాలంటే మున్సిపాలిటీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి ఉంటుంది. తక్కువ ధరకే ప్లాట్‌ల కొనుగోలు జరుగుతున్న దీని పరిధిలోకి రావడం వల్ల ఒకేసారి వాల్యూ మేషన్ పెరిగి ఇటు రిజిస్ట్రేషన్ చార్జీలు అటు ప్లాట్ల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. పాలనాపరంగా కూడా ఇకమీదట ఈ తండాలు పంచాయతీల్లో ఇల్లు కట్టుకోవాలన్నా మున్సిపాలిటీ లేదా అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుమతి పొందాల్సి ఉంటుంది. అలాగే తండాలో ఏ చిన్న పనిచేయాలన్నా మున్సిపాలిటీ నిధుల కోసం దేబిరించాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ రకంగా తండాలు ఇలా నిధులను తమ స్వపరిపాలన హక్కును కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం అవుతుంది.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలపై కసరత్తు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో కొత్తగా నాలుగు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆయా కలెక్టర్లు సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులతో సంప్రదించి సాధ్యాసాధ్యాలపై కసరత్తు ప్రారంభించారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్వరూపంపై కింది స్థాయి సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు. కాగా తమకు అనుకూలంగా అర్బన్ డెవలప్‌మెంట్ ఆచార్యులు ఏర్పాటు కోసం జిల్లాలోని మంత్రి ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. తమకు అనుకూలంగా ఉండేలా వీటిని ఏర్పాటు చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఇప్పుడున్న పరిధి కాకుండా మరింత పెంచేలా చూస్తున్నారు. ప్రస్తుతం భూత్పూర్, జడ్చర్ల మున్సిపాలిటీలు ఈ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలో ఉన్నాయి. మరింత పెరిగితే ఇటు హన్వాడ అటు రాజాపూల్ మరోవైపు మూసాపేట, మన్యంకొండ వరకు పరిధి పెంచే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. పది నుంచి 15 పంచాయతీల వరకు విస్తరించే అవకాశం ఉంది. అభివృద్ధి మాటున పంచాయతీల హక్కులు కాలరాసే విధంగా ప్రభుత్వ నిర్ణయాలున్నాయని విమర్శలు తలెత్తుతున్నాయి.

కురుమూర్తి ఆలయానికి స్వర్ణాభరణాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కాంచనగుహన స్వర్ణకాంతులు

కనులపండువగా కురుమూర్తి రాయుడి అలంకారోత్సవం

- ఆత్మకూరు నుంచి ఏడుకొండల వరకు భారీగా ఊరేగింపు
- ఆభరణాలకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కలెక్టర్ పూజలు
- మార్మోగిన గోవింద నామస్మరణ

ఆత్మకూరు, నవంబర్ 6 : పేదల తిరుపతిగా ప్రసిద్ధి చెందిన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల్లో మొదటి ఘట్టమైన అలంకార మహోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. ఆత్మకూరు నుంచి కురుమూర్తి కొండల వరకు స్వామి వారి స్వర్ణాభరణాల ఊరేగింపు భారీ భక్తజనుల మధ్య సాగింది. అలంకార మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆత్మకూరు పట్టణం శోభాయమానంగా ముస్తాబైంది. ముందుగా ఆత్మకూరు ఎస్బీఐలో భద్రపరిచిన కోట్లాది విలువచేసే స్వర్ణాభరణాలను బ్యాంకు మేనేజర్ అబ్బాస్‌అలీ, క్షేత్ర అధికారి అజయ్‌కుమార్, అకౌంటెంట్ స్వాతి నేతృత్వంలో రాజకీయ నాయకుల సమక్షంలో ఈవో రఘునాథ్‌రెడ్డి లాకర్‌ను తెరిచారు. గాడి వంశస్తులు చింతకుంట గాడి బాలరాజు స్వర్ణాభరణాలు పెట్టెను బయటకు తీశారు. బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో స్వామివారి స్వర్ణాభరణాలను లాంఛనప్రాయంగా ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, సీతాదయాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం మేళతాళాలు, కుర్వ డోళ్లు వాయిద్యాలతో స్వర్ణాభరణాల ఊరేగింపును ప్రారంభించారు. కళాకారులు, చిడతల భజన, కేరళ వాయిద్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రతినిధులు ముందు నడుస్తూ ఊరేగింపును కొనసాగించారు. పోలీసుల భారీ బందోబస్తుతో భక్తుల ఇబ్బందులు గుర్తించిన ఎమ్మెల్యే శ్రీహరి రోప్ పార్టీని తొలగించారు. పరమేశ్వరస్వామి చెరువుకట్ట వరకు కాలినడకన సాగిన ఊరేగింపులో దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల రాజకీయ ప్రముఖులు భారీగా పాల్గొన్నారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఊరేగింపులో పాల్గొని స్వర్ణాభరణాలను దర్శించుకున్నారు. ఎమ్మెల్యేలు కలెక్టర్‌ను సాదరంగా స్వాగతించి సన్మానించారు. ఊరేగింపు పొడవునా వేలాదిగా భక్తులు స్వామి స్వర్ణాభరణాలను, పట్టువస్త్రాలను తాకి మొక్కేందుకు పోటీపడ్డారు. శివసత్తుల పూనకాలు, గోవిందనామస్మరణలతో ఆత్మకూరు పట్టణం మార్మోగింది. పట్టణ శివారులోని పరమేశ్వరస్వామి చెరువుకట్టపై పరమశివుడి ఆలయానికి అభిముఖంగా స్వర్ణాభరణాలతో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు పూజలు నిర్వహించారు. అనంతరం సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్‌ల నేతృత్వంలో భారీ బందోబస్తు నడుమ స్వామివారి స్వర్ణాభరణాలను పట్టణం నుంచి సాగనంపారు. పోలీసుల కాన్వాయ్‌తో ప్రత్యేక వాహనంలో మదనాపురం మండలం కొత్తపల్లి, దుప్పల్లి మీదుగా అమ్మాపురం చేర్చారు. అమ్మాపురం ముక్కెర రాజవంశానికి చెందిన అమ్మాపురం సంస్థానాధీశుడు రాజా శ్రీరాం భూపాల్‌రెడ్డి స్వగృహంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యేల సారథ్యంలో భారీ భక్తసమూహంతో స్వర్ణాభరణాలను కొండపైకి చేర్చారు. ప్రధాన ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కార్యనిర్వాహక అధికారి సమక్షంలో స్వామివారి స్వర్ణాభరణాలను ప్రధాన పూజారులకు అప్పగించారు. ప్రత్యేక పూజల అనంతరం కాంచనగుహలో కొలువుతీరిన కురుమూర్తిస్వామికి అలంకరించారు. స్వర్ణభూషితుడైన స్వామివారితో కాంచనగుహ స్వర్ణకాంతులతో ధగధగలాడింది. ఆత్మకూరు సీఐ శివకుమార్ నేతృత్వంలో ఒక డీఎస్పీ, ఆరుగురు ఎస్సైలు, 80 మంది కానిస్టేబుల్స్, ఒక స్పెషల్ రోప్ పార్టీ ఆధ్వర్యంలో ఆభరణాల ఊరేగింపుకు పోలీసులు పకడ్బందీగా నిర్వహించారు. మహోత్సవంలో ఆత్మకూరు, అమరచింత, కొత్తకోట, మదనాపురం, చిన్నచింతకుంట, దేవరకద్ర, నర్వ మండలాలకు చెందిన అన్ని పార్టీల ముఖ్య నాయకులు, అధికారులు, పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రీయాదవ్, వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, పీఏసీసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ శశిధర్, నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, వర్కటం జగనాథ్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, నాగరాజు గౌడ్, రహమతుల్లా, మొగిళి గంగాధర్ గౌడ్ పరమేశ్, శ్రీనివాసులు, వెంకటన్న, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.


కురుమూర్తి స్వామికి ఆభరణాలు అలంకరించిన దృశ్యం

రుణమాఫీ ఎప్పుడు చేస్తారు..?

- పెంట్లవెల్లి సొసైటీలో మాఫీపై మంత్రి ఎందుకు స్పందించడం లేదు
- రామాపురం రుణ బాధిత రైతులు

పెంట్లవెల్లి, నవంబర్ 6 : పెంట్లవెల్లి సొసైటీలోని 499మంది రైతుల్లో ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదని, ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి జూపల్లి ఎందుకు స్పందించడం లేదని పెంట్లవెల్లి సొసైటీ రుణమాఫీ బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. మంత్రి జూపల్లి రుణమాఫీపై స్పందించకుంటే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. బుధవారం మండలంలోని రామాపురం రైతులు పెంట్లవెల్లి సొసైటీలో రైతులకు రుణమాఫీ చేయాలని కోరుతూ తాసీల్దార్ జయంతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సొసైటీలో 499 మంది రైతులుంటే ఒక్కరికీ ఒక్క రూపాయి కూడా రుణమాఫీ చేయక పోవడం దారుణమన్నారు. కొద్దిరోజులు సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు రుణమాఫీ చేయాలని కోరుతున్నా, ఆందోళనలు నిర్వహిస్తున్నా పట్టించుకోక పోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి సైతం ఈ విషయంలో కలుగుజేసుకోక పోవడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో చంద్రయ్య యాదవ్, రైతుబంధు సమితి అధ్యక్షుడు నిరంజన్, నాయకులు సాయిప్రకాశ్, శ్రీరాములు, నర్సింహ రైతులు ఉన్నారు.

తాసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రామాపురం రైతులు

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

ఇరుకు గదిలో ఉన్న అచ్చాయిపల్లి పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న బృందం

మూసాపేట, నవంబర్ 6 : మూసాపేట మండలంలోని అచ్చాయిపల్లి, కొమిరెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం జాతీయ స్థాయి మానిటరింగ్ బృందం సభ్యులు ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి మానిటరింగ్ అధికారులు ముత్తుకుమార్, దేవన్‌లు అచ్చాయిపల్లి, కొమిరెడ్డిపల్లి గ్రామాల పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పల్లె ప్రకృతివనం, కమ్యూనిటీ సోక్‌పిట్, సీసీ రోడ్లు, ఇంకుడు గుంతలు, శ్మశానవాటికలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, ఈత వనాలను పరిశీలించారు. అయితే కేంద్రం బృందం సభ్యులు పరిశీలించే సమయంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులకు సంబంధించి మంజూరైన నిధులు ఎంత? వాటిలో ఎన్ని నిధులు ఖర్చు చేసి పనులు చేశారు. పనులు ఎంత వరకు పూర్తి అయ్యాయి. వాటితో ప్రజలకు ఎంత మేరకు ఉపయోగపడుతున్నాయనే విషయాలపై వారు ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీపాద్, పీవో సుప్ప, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీవో అనురాధ, ఏపీవో పులేందర్, ఆంజనేయులు, సాయిరెడ్డిలతోపాటు ఆయా గ్రామల పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఆభరణాల ఊరేగింపునకు హాజరైన ఎమ్మెల్యేలు జీఎమ్మార్, శ్రీహరి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ప్రజాప్రతినిధులు

అశ్వవాహనంపై ఊరేగింపు

చిన్నచింతకుంట, నవంబర్ 6 : కురుమూర్తిస్వామికి బుధవారం అశ్వవాహన సేవ నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రధానాలయం నుంచి మోకాలుగుండు వరకు ఊరేగించారు. అలాగే స్వామి ఆలంకారోత్సవం కనులపండువగా జరిగింది. ఆత్మకూరు నుంచి స్వర్ణాభరణాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ కమిటీకి అప్పగించి స్వామికి అలంకరించారు. దీంతో కాంచనగుహ ధగధగలాడింది. దేవరకద్ర, మక్తల్ ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈవో మదనేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సీతాదయాకర్ రెడ్డి, స్వర్ణసుధాకర్ రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఎల్లయ్య, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

చిడతల భజన చేస్తున్న చిట్టెం

పట్టువస్త్రాల ఊరేగింపు

అమరచింత, నవంబర్ 6 : కురుమూర్తిస్వామి ధరించే పట్టువస్త్రాలను అమరచింత చేనేత కార్మికులు పదిరోజులుగా నియమనిష్టలతో నేశారు. బుధవారం ఈ వస్త్రాలను భక్త మార్కండేయ ఆలయంలో ఉంచగా ఎమ్మెల్యే శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాజా భజంత్రీలతో పద్మశాలీ సంఘం సభ్యులు ఊరేగింపుగా ఆత్మకూర్‌కు తరలించి అక్కడి నుంచి ఆభరణాలతోపాటు కురుమూర్తికి తరలించి అప్పగించారు

విద్యార్థుల జీవితాలతో ఆటలా..?

అచ్చంపేట, నవంబర్ 6 : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నదని ఏబీవీపీ నగర కార్యదర్శి శంతన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలో కళాశాల విద్యార్థులచే ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నందు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.7500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థులను చదువుకు దూరం చేస్తుందన్నారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా మొండికేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు ప్రశాంత్, వంశీ, వరుణ్, హేమంత్, క్రిష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో ఆందోళన చేస్తున్న ఏబీవీపీ, కళాశాల విద్యార్థులు

జాతీయస్థాయి చెస్ పోటీకి మహిళా ఇంజినీర్

దోమలపెంట, నవంబర్ 6 : గుజరాత్ రాష్ట్రంలో ఈ నెల 12న జరిగే జాతీయస్థాయి చెస్ పోటీలకు శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న మహిళా అసిస్టెంట్ ఇంజినీర్ అఖ్తర్‌బేగం ఎంపికయ్యారు. ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటి స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ పోటీలకు 18 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన నుండగా తెలుగురాష్ట్రాల నుంచి అఖ్తర్‌బేగంగా పాల్గొననున్నారు. జాతీయస్థాయి చెస్ టోర్నీకి ఎంపికైన అసిస్టెంట్ ఇంజినీర్ అఖ్తర్ బేగాన్ని బుధవారం చీఫ్ ఇంజినీర్ రామసుబ్బారెడ్డితోపాటు పలువురు ఇంజినీర్లు, అధికారులు అభినందించారు.

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధరలు

దేవరకద్ర, నవంబర్ 6 : దేవరకద్ర మార్కెట్ యార్డులో ఉల్లి ధర స్వల్పంగా పెరిగింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సాగు కొత్త ఉల్లిని విక్రయించేందుకు వ్యవసాయ మార్కెట్‌కు వస్తుండటంతో మార్కెట్‌లో ఉల్లి ధర మూడు వారాల నుంచి తగ్గుతూ రాగా బుధవారం మాత్రం స్వల్పంగా పెరిగింది. ఉల్లికి గరిష్ఠంగా రూ.3,600 ఉండగా కనిష్ఠంగా రూ2,330 ధర పలికింది. గత వారం క్వింటా రూ.2800 ఉండగా ఈ వారం స్వల్పంగా ధరలు పెరిగినట్లు మార్కెట్ అధికారులు వెల్లడించారు.

ఎస్‌వీఎం డిగ్రీ, పీజీ కళాశాలకు షోకాజ్ నోటీసులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 6 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎం డిగ్రీ, పీజీ కళాశాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వీసీ వైస్‌చాన్స్‌లర్ శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ నిర్ణయించిన దానికంటే అదనంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు నోటీసులు ఇవ్వడంతోపాటు వివరణ కోరామన్నారు. వీసీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తే గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. అందరూ నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

పాంపాండ్లను కూల్చిన అధికారులు

పోలేపల్లిలో జేసీబీతో పాంపాండ్లను ధ్వంసం చేస్తున్న దృశ్యం

జడ్చర్ల, నవంబర్ 6 : జడ్చర్ల మండలంలోని పోలేపల్లితోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యవసాయ బోరు బావుల దగ్గర నీటినిల్వ కోసం ఏర్పాటు చేసుకున్న పాంపాండ్లను బుధవారం రెవెన్యూ అధికారులు ధ్వంసం చేశారు. పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమలకు వ్యవసాయ బోరు బావుల నుంచి ఉచిత విద్యుత్ వినియోగిస్తూ భూగర్భ జలాలను కొల్లగొడుతూ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారన్న ఫిర్యాదుతో లోకాయుక్త అధికారులు మంగళవారం పోలేపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పర్యటించి నీటిని సరఫరా చేసే బోర్లను గుర్తించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై లోకాయుక్త బృందం ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్పందించిన రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో బుధవారం జేసీబీతో నీటినిల్వ కోసం ఏర్పాటు చేసిన పాంపాండ్లను ధ్వంసం చేశారు. ఇకపై ఎవరైనా నీటిని నిల్వ చేసిన కంపెనీలకు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఖదీర్, ఆంజనేయులు, నాగరాజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా

నాగర్‌కర్నూల్, నవంబర్ 6 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్‌అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 2019 అక్టోబర్‌లో గత ప్రభుత్వం జీవో 51 విడుదల చేసి సిబ్బంది వేతనాలను రూ.8,500 పెంచిందన్నారు. పెంచిన వేతనాలు అందించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 500 మంది జనాభాకు ఒక కార్మికుడి చొప్పున 36,500 మందిని ఖరారు చేసి ఆన్ లైన్‌లో వారి పేర్లను పొందుపర్చాలన్నారు. గడిచిన 15 ఏండ్ల కాలంలో గ్రామ పంచాయతీల విస్తీర్ణం తోపాటు గ్రామాల్లో ప్రజల సంఖ్య పెరిగిందన్నారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం అవసరాలు కూడా పెరగడంతో అదనంగా సుమారు 13,500 మంది కార్మికులను అనేక పంచాయతీల్లో నియమించి వారిని ఆన్ లైన్‌లో నమోదు చేయక పోవడంతో వేతనాల చెల్లింపులోనూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులోనూ ఎలాంటి గుర్తింపునకు నోచుకోక పోతున్నారన్నారు. పంచాయతీల అవసర ప్రాతిపదికన అదనపు కార్మికులను నియమించి వారికి చెల్లించే వేతనాలు చెల్లించకుండా పాత కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలను అదనపు కార్మికులకు కలిసి పంచి ఇవ్వడం వల్ల ప్రతినెలా రూ.9,500 అందుకోవాల్సి కార్మికులకు ఈ విధానంతో మూడు, నాలుగు వేలు మాత్రమే అందుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీవో 51 సవరణ నుంచి మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని, పంచాయతీ కార్మికుల వేతనాల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంట్